

# అంతర్యం

ఎ.మంజులత

"హలో !"

"నువ్వా ? ఇక్కడికి రావద్దని ఎన్ని సార్లు చెప్పాను ?"

"లెక్కపెట్టలేదు. సారీ !"

"ఎందుకొచ్చా విక్కడికి ?"

"నీ కోసమే !"

"తెలుస్తూనే వుందిలే! నువ్వింటికెళ్ళు. నేను బాంక్ మూసేసాక వస్తాను.

"నాకు ప్రస్తుతం పనేమీలేదు. మీ బాంక్ మూసేసేవరకు ఇక్కడ కూర్చుని నీ కోసం వెయిట్ చెయ్యగలను."

"నువ్వు వెయిట్ చెయ్యగలవుగానీ, చెయ్యకూడదు. నువ్వింటికి పద."

"ఎందుకు చెయ్యకూడదు, పద్మా డియర్ ? అదుగో, అక్కడ వాళ్లంతా చెయ్యడంలే !"

"వాళ్ళు వెయిట్ చేసేది నాకోసం కాదు. కాషియర్ దగ్గర కాష్ తీసుకోటానికి." పళ్లబిగువున చెప్పింది పద్మ.

"వాళ్ళు క్యాష్‌కోసం వెయిట్ చేస్తే నేను నీ కోసం వెయిట్ చేస్తాను. ఏదయితేనేం ? వెయిటింగేగా ?"

ఇక అతనితో వాదించడం ఇష్టంలేక పద్మ బాంక్ మేనేజరును ఒక గంట ముందుగా ఇంటికి వెళ్ళడానికి పర్మిషను అడిగి బయటికి వచ్చింది.

హరి కూడా నవ్వుకొంటూ పద్మ వెనకే వచ్చాడు.

"పైగా ఆ నవ్వేందుకూ ?" కోపంగా అంది

"నవ్వక ఏడవమన్నావా ? ఇదుగో, చూడమ్మాయీ పద్మా ! లక్స్ ఎడ్వర్ టైజ్‌మెంట్‌లోలాగా నే నెల్లప్పుడూ నవ్వుచునే యుందును. అదియే నా సౌందర్య రహస్యము."

"చాల్లే, ఇక ఆపు హాస్యం. నువ్వు నెమ్మదిగా నడుస్తూ ఉండు."

"ఏం ? నువ్వు పరిగెడతావా ?"

పద్మ అంత విసుగులోనూ ఫక్కున నవ్వేసింది. హరి కిం కిపంగి రోడ్డు మీద ఏమిటో వెతుకుతున్నాడు

"ఏమిటి ?" అని అడిగింది పద్మ అర్థంకాక.

"కింద ముత్యాలు జాలువారి నట్టుం టేనూ !" అన్నాడు హరి మళ్ళీ స్ట్రెయిట్‌గా నిలబడుతూ.

"చాల్లే ! ఆపు. అదిగో మా ఫ్రెండు కనకం వస్తోంది. నేను ఆవిడతో మాట్లాడి వస్తాను. నువ్వు నెమ్మదిగా నడుస్తూ ఉండు" అంది పద్మ.

కానీ పద్మ కనకాన్ని పలకరించే లోపే హరే అందుకున్నాడు.

"హల్లో! కనకంగారూ! నమస్కారం. ఇవ్వాళ నిన్ను కనకంగారికి పరిచయం చేస్తాను బావా, నువ్వావిడతో మాట్లాడాలి అంటోంది మా పద్మ. మీ ఆడాళ్ళ కబుర్లలో నే నెందుకులే అన్నాను. అయినా వింటేనా ? నువ్వు మాట్లాడితీరాలి బావా అంటోంది మా పద్మ. నేను సరే, విత్ ప్లెజర్ అని..."

పద్మ పళ్ళు కొరుక్కుంది. కోపంతో పిడికిళ్ళు బిగించుకుంది. చేసేదేంలేక అసహాయంగా నిలబడి 'ఏంచేస్తే బాగుంటుంది ఈ హరిని !' అనుకుంది.

"అసలు సంగతేమిటంటే, నేనూ, పద్మా పెళ్ళిచేసుకోబోతున్నాం. మా ఎంగేజిమెంటు మొన్ననే అయింది. మీతో చెప్పడానికి సిగ్గుపడుతోంది. ఎంతయినా ఆడపిల్ల కదా ! నువ్వే చెప్పు బావా అంటోంది."

'అబద్ధం' అని అరవాలనుకుంది పద్మ కానీ ఆ ఆశ్చర్యంలో ఎంత షాక్ తిన్నదంటే, అరవలేకపోయింది.

"సరేనండీ కనకంగారూ ! మరి వస్తాం. అర్జంటు పనుంది. సినిమాకి బయలుదేరాం. మీ రోసారి ఇంటికి రావాలి సుమండీ ! పద, పద్మా డియర్ !" అంటూ లాక్కెళ్తున్నాడు హరి !

పద్మ ఆశ్చర్యంనుంచి తేరుకునే సరికే కనకం "కంగ్రాచ్యులేషన్స్" అని వెళ్ళిపోయింది.

"ముక్కూ మొహం తెలియని ఆవిడతో అట్లా మాట్లాడటానికి నీ కెంత ధైర్యం !" కోపంతో అరిచినంతపని చేసింది పద్మ.

"ధైర్య మేమిటి? ఆవిడేం భూతమా? మామూలు మనిషేగా ?" అన్నాడు హరి.

"ఆవిడెవరో తెలుసా ? సైకాలజిస్టు. సైకాలజీలో రిసెర్చి చేస్తోంది. ఆవిడ థీసిస్‌లో నీ గురించి, నీ మనస్తత్వం గురించి..."

"ఏం రాస్తుందో నాకు తెలుసు. ఈ అబ్బాయిది ఎంత మంచి మనసు ! ఇట్లాంటివాడు ఈ భూమ్మీద లేడు. పాపం, ఈ పద్మే తెలుసుకోవడంలేదు అని రాస్తుంది."

పద్మ ఇంతేం మాట్లాడలేదు. ఆలోచిస్తోంది. ఇతనికి ఎలా బుద్ధిచెప్పాలి ? ఆవేశపడకుండా చక్కగా బుద్ధిచెప్పాలి ఎలా ?

ఇద్దరూ నడుస్తున్నారు. "చిలుకల కొలికి, పద్మావతికి అలుకే సిగాంరం ." అని పాడుతున్నాడు హరి.

ఉన్నట్టుండి పద్మ అంది. "నేను రమేశ్‌ని రిజిస్టర్ మారేజ్ చేసుకుంటున్నాను తెలుసా ?"

హరి నడుస్తున్నవాడల్లా టక్కున ఆగిపోయాడు. ఒక్క క్షణం ఆగి "నా పేరు రమేశ్ అని మార్చేశావా ? బాగానే ఉంది పేరు "

ఈసారి పద్మ కోపం తారాపథాన్ని అంటింది. కానీ నిగ్రహించుకుంది

"నువ్వు ప్రతీదీ అంత హాస్యంగా తీసుకుంటానంటే నీ యిష్టం. కానీ ఇది మట్టుకు నిజం. నేను రమేశ్ అనే నా ఫ్రెండుని పెళ్ళిచేసుకోబోతున్నాను" అంది.

హరి నడక ఆపేసి కళ్ళు పెద్దవి చేసుకుని పద్మవంకే చూస్తున్నాడు. మళ్ళీ పద్మే అంది "నేను ఈ విషయం ఇంకా ఎవరితోనూ చెప్పలేదు. నువ్వు ఇందాక కనకంతో అంత అబద్ధం ఆడితేనూ, నీకు నిజం తెలిస్తే మంచిది కదా అని చెబుతున్నాను. నువ్వు నా గురించి ఏవో ఊహలు పెట్టుకున్నట్టున్నావు" నిదానంగా ఒక్కొక్క అక్షరమే వత్తి పలుకుతూ అంది పద్మ.

"నిజమా పద్మా !" బలహీనంగా అడిగాడు హరి.

అతన్ని అట్లా చూస్తే నవ్వొస్తోంది పద్మకి. 'బాగా అయ్యిందా ! తిక్క కుదిరిందా ?' అనుకుంది లోపల్లోపల. తన నవ్వు బయటికి తెలుస్తుందేమోనని మాట్లాడలేదు పద్మ.

"మరి...మరి...మామయ్య అట్లా అన్నాడేం ?" మళ్ళీ హరే అడిగాడు.

"ఏమన్నాడు ?" పద్మ అడిగింది.

"శ్రావణంలో ముహూర్తాలు పెట్టుకుందామని మా అమ్మతో అన్నాడు."

పద్మకి మళ్ళీ కోపం వచ్చింది. తనతో ఒక్కమాటన్నా చెప్పకుండా, పెళ్ళికి ముహూర్తం పెడతాడా తన తండ్రి !

"రమేశ్‌ని చేసుకోబోతున్నట్లు నే

నింకా చెప్పలేదురే ! అందుకని అట్లా అని ఉంటాడు."

హరి ఏమీ మాట్లాడకుండా ఓ రెండు నిముషాలు పద్మతోపాటుగా నడిచాడు. తర్వాత ఉన్నట్టుండి అటుగా పోతున్న ఖాళీ ఆటోను కేకేసి, అందులో కూర్చుని "వస్తా పద్మా ! బై !" అని వెళ్ళిపోయాడు.

'చాలా అబ్రెప్ట్‌గా వెళ్ళిపోయాడు' అనుకుంది పద్మ. కానీ చాలా ఉత్సాహం వచ్చేసింది. బాగా బుద్ధి చెప్పాను అని తనని తానే మెచ్చుకుంది. రెండురోజుల వరకూ విజయగర్వంగా నవ్వుకుంది పద్మ, హరిని తలుచుకుని.

మూడోనాడు మాత్రం "హరి కనిపించి చాన్నాళ్ళయిందే" అనిపించింది. దాదాపు రోజూ యింటికి వచ్చే హరి మూడురోజులు వరుసగా కనిపించకపోతే అట్లా అనిపించదూ మరి ?

* * *

నాలుగురోజుల తర్వాత మళ్ళా కనకం కనబడింది, ఇంటికి వెళ్తూ. ఏదో పని ఉందని పద్మతో బాటు వచ్చింది కొంత దూరం.

మాటల సందర్భంలో "నేను అడుగుతున్నానని ఏం అనుకోకుగానీ, నీ పెళ్ళి విషయం ఏమయ్యింది ?" అంది చాలా కుతూహలం కనబరుస్తూ.

"నా పెళ్ళేమిటి ? విషయ మేమిటి?" ఆశ్చర్యపోయింది పద్మ.

"నువ్వు ఎవరో రమేశ్ అనే ఆతన్ని పెళ్ళిచేసుకోబోతున్నావట ?"

"నేనా ? రమేశ్‌నా ? ఎవరా రమేశ్ ? ఏమా కథ ?" మళ్ళీ ఆశ్చర్యపోయింది పద్మ.

"అరె ! మీ బావ చెప్పాడే ?"

పద్మ బుర్రలో అమాంతం లైటు వెలిగింది.

"మా బావ నీకెలా చెప్పాడు ? ఎప్పుడు చెప్పాడు ? ఎందుకు చెప్పాడు? ఎట్లా చెప్పా..."

"స్టాప్ ప్లీజ్ ! మీ బావ, మా తమ్ముడూ ఒకే చోట ట్రెయినింగ్ అవుతున్నారని, మాంచి ఫ్రెండ్స్ అయ్యారనీ నీకు తెలీదుకదూ ? మీ బావ నాకు రెండునెలలనుంచీ తెలుసులే. తెలుసేమిటి, మంచి ఫ్రెండు."

"అమ్మదొంగా ! నువ్వుగానీ, హరిగానీ నాతో చెప్పనేలేదు కదూ ?"

"నువ్వా రోజు మీ బావని చెప్పనివ్వలేదటగా? అది సరే, ఇంతకీ రమేశ్ ఎవరు ? ఎక్కడుంటాడు ? ఎట్లా ఉంటాడు ? ఏం చేస్తుంటాడు..."

"స్టాప్ ! స్టాప్ ! రమేశ్ పేరుగల వాళ్ళు లోకంలో చాలామందే ఉన్నారుగానీ, నాకు తెలిసిన వాడెవడూ లేడు. మా బావని కాస్సేపు ఏడిపిద్దామని అట్లా చెప్పాను. ఆ మాటలు నమ్మేసి తను ప్రకారం చేస్తున్నాడులా ఉంది."

"రక్షించావు పో ! మీ బావ అపర

దేవదాసై తిరుగుతున్నాడు. వెళ్ళి అమాంతం అభయం ఇవ్వు."

"అభయం ఎందు కివ్వాలి? కాస్త భయం ఉంటేనే మంచిది."

"పెళ్ళాడబోయేవాణ్ణి అంత మోసం చెయ్యటం అన్యాయమోయ్ పద్మా!"

"నేను అతన్ని చేసుకుంటానని ఎవ రన్నారు? అతనేనా?"

"ఎవరంటే ఏం? హరి అంటే నీ కిష్టంలేదా?"

"అతనంటే ఇష్టం లేదన్నానా? అతన్ని పెళ్ళిచేసుకోడం ఇష్టంలేదు."

"అదే, ఎందుకనీ? అతని కేం తక్కువనీ? ట్రెయినింగ్ అవగానే పెద్ద ఆఫీసరు కాబోతున్నాడు. మనిషి తెల్లగా, పొడుగ్గా ఉంటాడు."

మా బావ ఉత్త వాగుడుకాయ. పైగా నా చుట్టూ తిరిగి నన్ను బోర్ చేసేసాడు."

"ఓహో! అదన్నమాట సంగతి. నీ చుట్టూ తిరగడం తప్పయిపోయిందా? తిరక్కుండా ఉంటే, నువ్వే అతని చుట్టూ తిరిగేదాని వన్నమాట."

"నేనేం అట్లా అనలేదు."

"అయితే నువ్వు హరిని పెళ్ళిచేసుకో వన్నమాటేగా?"

"అన్నమాటేం? ఉన్న మాటే!"

* * *

ఆ తర్వాత వారం రోజులకి కలిసింది కనకం.

"మీ బావ భలేవాడోయ్ పద్మా?"

అంది.

"ఏమిటా భలేతనం?"

"నిన్ను ప్రేమించి విఫలప్రేమికు డయ్యాడా? దేవదాసల్లే అయ్యాడని చెప్పానా? నిజంగా దేవదాసే అవుతా డనుకున్నాను. నాలుగురోజుల తర్వాత చూద్దును కదా, వేషం, భాష మార్చేసి, మళ్ళీ ఎప్పట్లాగే పూలరంగడల్లే తయారై వచ్చాడు మా ఇంటికి."

పద్మకి ఎందుకో చీమకుట్టినట్లయింది. తను పెళ్ళిచేసుకోకపోతే అతనికేం ఖాతరులేదన్నమాట. మళ్ళీ కనకమే అంది.

"అసలు సంగతేమిటంటే, అతనికి కొత్తగా ఓ గర్ల్‌ఫ్రెండ్ దొరికిందట. మా తమ్ముడు చెప్పాడులే!"

ఈసారి పద్మకి తేలుకుట్టినట్లే అని పించింది. హరికి ఒక గర్ల్‌ఫ్రెండ్!

"ఇదివరకు ఇంకాసేపు కూచోమని బ్రతిమిలాడాల్సి వచ్చేది. ఇప్పుడైతే మాఇంట్లో మకాంవేసినట్లే ఉంటున్నాడు. మా తమ్ముడు అసలు రహస్యం చెప్పాడు. మా యింటికి రెండిళ్లవతల కొత్తగా వచ్చిన డాక్టరుగారి అమ్మాయి విమలేనట మీ బావ కొత్త ఫ్రెండు. అదీ సంగతి!"

పద్మకి తేలుకుట్టినాక, చరచరా పైకి ఎక్కుతున్నట్లనిపించింది.



"మొన్నా విమల అంటోంది. హరి కాదు. గంటలు నిమిషాల్లా చేసేస్తాడు టెరిఫిక్ ఫెలో అండీ? భలే మాట్లాడ అంటోంది. అసలు ఆ విమల..."

"సర్లే ! వస్తా ! త్వరగా ఇంటి కెళ్ళాలి" అంటూ నడక సాగించింది.

"ఎట్లా ఉంటుందో ఆ విమల ! కోతల్లేనే వుండి ఉంటుంది !"అనుకుంది.

"ఛ ! కోతల్లే ఉండదు" అంది పద్మ మనస్సు.

"మరి? కొండముచ్చుల్లే ఉంటుందా?" కోపంగా అడిగింది పద్మ.

"ఛ ! కొండముచ్చుల్లే కూడా ఉండదు. అందంగానే ఉంటుంది. లేక పోతే హరెందుకు ప్రేమిస్తాడూ అంట?" అని ప్రశ్నించింది మనస్సు.

"ఆ అమ్మాయి గర్ల్‌ఫ్రెండేగా ? ఒక వేళ ప్రేమించలేదేమో ! ఉత్త ఫ్రెండే నేమో!"

"నీ మొహం ! ప్రేమించకపోతే అతను దేవదాసల్లా పూలరంగడెలా అయ్యాడు ? ఆ పిల్లని ప్రేమించాడు" అంది మనస్సు.

"ప్రేమిస్తాడు ! ప్రేమిస్తాడు ! బుద్ధి లేకపోతే సరి ! చెంపలు వాయగొడితే సరి !" అనుకుంది పద్మ.

"నీ కెందుకూ అంత కోపం? అతను ఎవర్ని ప్రేమిస్తే నీ కేం ? అతనంటే నీకు బోర్ కొట్టేసిందిగా?" వెక్కిరించింది మనస్సు.

"ఛ ! నోర్ముయ్ !" అంది పద్మ.

ఆ రోజంతా ముక్కూ-మొహం తెలీని ఆ విమలే వెన్నాడింది. తిండి తినబోతే తిననివ్వలేదు. నిద్రపోబోతే నిద్ర పోనివ్వలేదు చాలాసేపు. ఎప్పటికో నిద్రపోనిచ్చినా,మళ్ళీ కలలో ప్రత్యక్షం! ఈ సారి హరిని తీసుకొని డ్యూయెట్టు పాడుతూ మరీ వచ్చింది కల్లోకి.

"ఇక బావకి నేను అందర్లాంటిదాన్నే అనుకుంటే!"ఆ ఆలోచనే దుస్సహంగా, దుఃఖంగా ఉంది పద్మకి.

"హరి అంటే నా కింత ప్రేమ ఉందా !" అని ఆశ్చర్యపోయింది.


"నే నెందుకింత తెలివితక్కువగా హరిని వదులుకున్నాను !" అని బాధ పడింది.

"ఇప్పుడేం చెయ్యాలి ?" అని మధన పడింది.

ఆ మర్నాడు బాంక్ మేనేజరు ఏదో సందర్భంలో తన కాలేజీ లైఫ్ గురించి, తన తెలివితేటల్ని గురించి అరగంట బోర్ కొట్టాడు. పద్మ పరధ్యానంగా వింది. కనీసం విన్నట్లు నటించింది. "వాగుడుకాయలంటే ఇలాంటి వాళ్లేను !" అనుకుంది. మళ్ళీ హరి గుర్తుకొచ్చాడు "హరి మాట్లాడుతుంటే గంటల తరబడీ వినబుద్ధి అవుతుంది!" అనుకుంది.

పద్మ కొలీగ్ పద్మని"పరధ్యానంగా ఉన్నావ్, హరిధ్యానంలో ఉన్నావా?" అని వెక్కిరించింది.

పద్మకి ఇంకా దుఃఖం వచ్చింది. ఏమైనా సరే, తపస్సు చేసైనా సరే,




హరిని స్వంతంచేసుకోవాలి అని నిర్ణయించుకుంది.

* * *

ఆ తర్వాత కథంతా చకచకా జరిగి పోయింది. హరి ఎవరో అమ్మాయితో స్నేహంచేస్తున్నాడని పద్మ వాళ్లమ్మతో చెబితే, ఆ విడ వాళ్ల నాన్నతో చెప్పగా, వాళ్ల నాన్న వెళ్ళి హరి నాన్నతో చెప్పాడు.

అంచేత ఆయన శ్రావణంలో ముహూర్తం కూడా పెట్టించేసి, ఆ తర్వాత ఆ విషయం కొడుకుతో చెప్పాడు. హరి ఏమీ గొడవచెయ్యలేదు సరికదా, తనకు అంగీకారమేనన్నట్లు తలతాటించడం మాత్రం అందరికీ, అందరికన్న ఎక్కువగా పద్మకి ఆశ్చర్యానందాలు కలగజేసింది.

కానీ పద్మకి ఇంకా ఎందుకో అనుమానంగా ఉంది. ఇంతవరకు హరి తనని కలుసుకోనేలేదు. ఏమిటి అతని ఉద్దేశ్యం ?

ఇక ఉండబట్టలేక అతనికి ఫోను చేసింది. అతను ఇంట్లో లేడు." ఎందుకో గానీ, హరిని నాన్న సాయంత్రం తప్పకుండా రమ్మన్నాడు " అని హరి తల్లితో చెప్పింది. ఫోను పెట్టేశాకగానీ బుర్ర పనిచెయ్యలేదు. తండ్రికి హరితో పనిఉంటే, తండ్రే ఫోనుచేసి రమ్మనే వాడు కదా! తను చెప్పద మేమిటి, బుద్ధి తక్కువ, అనుకుంది.

ఇంతా చేస్తే, ఆ సాయంత్రం హరి రానేలేదు.

కానీ మర్నాడు సాయంత్రం పద్మ బాంక్‌నుంచి ఇంటికి వెళ్ళేసరికి పేపరు

ముఖానికి అడ్డంగా పెట్టుకుని హరి కూర్చుని ఉన్నాడు.

అతన్ని చూసేసరికి ప్రాణం లేచి వచ్చింది. పద్మని చూసి హరి బ్రాడ్ స్మైల్ చేసాడు.

"నిన్న రాలేదేం?" అంది పద్మ అప్రయత్నంగా.

"ఏం? అంతగా ఎదురుచూసావా నాకోసం?"

"ఛ! నేనెందుకు చూస్తాను? నాన్న రమ్మన్నాడు" అంది దబాయింపుగా.

"మీ నాన్న రమ్మనలేదని నాకు తెలుసులే!" అని నవ్వాడు హరి. పద్మకి కోపం తెచ్చుకోవాలని చప్పున స్ఫురించిందిగానీ, ఎందుకో కోపం రావడంలేదు.

"అసలు సంగతి చెప్పెయ్యనా? కనకంగారు వెళ్లొద్దన్నారు. అందుకే రాలేదు నిన్న" అన్నాడు హరి.

"ఆవిడ వెళ్ళవద్దనడం ఏమిటి?"

"ఎందుకో తెలుసా? నేను అస్తమానం నీ చుట్టూ తిరుగుతూ నిన్ను దేబిరిస్తుంటే నా విలువ తెలియకుండా అయిపోయిందట నీకు. అందుకనే ఆవిడ నీ మీద ఒక ట్రిక్కు ప్లే చేసారట కదా! నాకో గర్ల్‌ఫ్రెండ్ ఉందనీ, ఇంకా ఏమిటో... అందుకే నువ్వు దారికి వచ్చావట. అమాంతం నా విలువ తెలుసుకోగలిగావట పెళ్ళికి ఒప్పుకున్నావట. అందుకే ఇకముందు కూడా నీకు దాసోహం అన్నట్లు కాక, నీకు అందీ అందనట్లు ఉండాలట నేను. అప్పుడప్పుడూ నీ వీపు మీద రెండు వడ్డించమంది వీలయితే. కోపం రాకపోయినా సరే, నీ మీద కోపం నటించాలట. నీలాంటి అమ్మాయిలు డామినేట్ చేసే మగవాడినే ఆరాధిస్తారట, గౌరవిస్తారట, ప్రేమిస్తారట. హీరోలా కొలుస్తారట. ఇంతకీ ఇదంతా నీకు ఎందుకు చెప్పానంటే, నీ మీద అట్లా డామినేట్ చెయ్యగలగడం నాకు కష్టసాధ్యమేమో, నువ్వయినా రియలైజ్ అవుతావేమోనని ఆశ."

పద్మ ముఖం ఎర్రగా అయింది. కోపంతో ఊపిరి బరువుగా వస్తోంది. కానీ ఎందుకో హరి చెప్పిందంతా అక్షరాలా నిజం అనిపిస్తోంది.

"అదీ సంగతి! ఆవిడ నీ చుట్టూ తిరగొద్దు అంది" అన్నాడు హరి లేస్తూ.

"మరి ఎవరి చుట్టూ తిరగమంది?" కోపంగా అంది పద్మ

"అడగలేదు, మర్చిపోయాను."

"ఇంకెవరి చుట్టూనో తిరుగుతూ పిచ్చివేషాలు వేసావో..."

"ఏం? కొడతావా?"

"ఉహుఁ! ఏడుస్తాను అట్లా చేస్తే" క్షణం ఆలోచించి అంది పద్మ.

"అమ్మో! ఆ పని చెయ్యకు" అన్నాడు హరి పద్మ దగ్గరికి వస్తూ

———